క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన బీఎల్ఐసీ పరీక్షలు జరుగుతున్నాయి. కాగా, పరీక్ష కేంద్రాన్ని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.శ్రీనివాస్ ఆదివారం సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి తనిఖీచేశారు.

చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలి

ఖిలా వరంగల్: వినియోగదారుల సంఘాల ప్రతినిధులకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలని, ఈక్రమంలో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి సీసీఐ చేసిన తీర్మాన పత్రాన్ని అందజేయనున్నట్లు కన్జ్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుందర్శన్ తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సమస్యలను చట్టసభలో ప్రశ్నించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల వినియోగదారుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అతిథి ఆశ్రమానికి చేయూత



హసన్‌పర్తి: నగరంలోని అతిథి ఆశ్రమానికి బీఆర్ఎస్ నాయకుడు సహకారం అందించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమానికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసారి తన జన్మదిన వేడుకలను అనాధాశ్రమాల్లో జరుపుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తోట నాగరాజు, చకిలం చంద్రశేఖర్, నంది శ్రీనివాస్, సూర సతీష్, శివారెడ్డి, మూల దేవేందర్, శ్రవణ్, నిర్వాహకురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ కాలనీ అభివృద్ధికి కృషి



కాజీపేట రూరల్: 64వ డివిజన్ మడికొండ శివారులోని టీఎన్జీఓస్ కాలనీ అభివృద్ధికి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సహకారంతో తనవంతు కృషి చేస్తానని డివిజన్ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్ అన్నారు. టీఎన్జీవోస్ కాలనీ ఏర్పాటై 30 ఏళ్లు కావస్తున్న సందర్భంగా కాలనీ సమస్యలపై శ్రీకాంత్‌కు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెట్టం సాంబయ్య వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మడికొండ పట్టణ శాఖ అధ్యక్షుడు రమేష్, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు అన్నదానం



వరంగల్: నగరంలోని ఆటోనగర్ కొత్తవాడలోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక, ప్రధాన కార్యదర్శి నన్నపునేని సంజీవరావు, కళ, సరోజన, సుభద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్య సమస్యలతో పెగడపల్లికి చెందిన చిన్నదామెర శాంతమ్మ మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొంరెల్లి తదితరులు పాల్గొన్నారు.

మార్నేని రవీందర్‌రావుకు..

కాజీపేట రూరల్: డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును కాజీపేట బీఆర్ఎస్ నాయకులు ఆయన స్వగృహంలో ఆదివారం కలిసి పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు రవీందర్‌రావు కాలికి బలమైన గాయం కాగా, ఈమేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. కార్యక్రమంలో నాయకులు సిరిల్ లారెన్స్, మర్యాల కృష్ణ, గోల్కొండ రాంబాబు, ఎండీ.మతీన్, సతీష్ పాల్గొన్నారు.

కేంద్రం ఫాసిస్ట్ విధానాలపై ఐక్య పోరాటం



భారత్ బచావో సదస్సులో మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

నయీంనగర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్ట్ విధానాలపై ఐక్యంగా పోరాడాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భారత్ బచావో సదస్సులో చీఫ్‌విప్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చిందని ఆరోపించారు. అన్ని మతాలను గౌరవించాలన్న స్ఫూర్తిని మరిచి దేశవ్యాప్తంగా మత విద్వేషాలను రెచ్చగొడుతోందని చెప్పారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోస్తూ రాష్ట్రాల హక్కులను కాలరోస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసీలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో బీజేపీ సాగిస్తున్న మత మౌఢ్య ఫాసిస్ట్ పరిపాలన విధానాల నుంచి దేశాన్ని రక్షించాలనే ఆలోచనతో నిర్వహిస్తున్న భారత్ బచావో సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశం ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటోందని వాపోయారు. ఈక్రమంలో కేంద్రంపై పోరాడాలని రాజేందర్‌రెడ్డి గుర్తుచేశారు. భారత్ బచావో ప్రతినిధి డాక్టర్ ఎం ఎఫ్.గోపీనాథ్ మాట్లాడుతూ భారత్ బచావో విధి విధానాలు - కార్యాచరణ అంశంపై వివరించారు. ఈ సదస్సులో సామాజిక విశ్లేషకులు ఎ.నర్సింహారెడ్డి, ఇంటలెక్చువల్స్ ఫోరం కన్వీనర్ ఎస్.రామబ్రహ్మం, డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, ఎం.వెంగల్‌రెడ్డి, నల్ల సుధాకర్ రెడ్డి, ఎన్.రవీందర్, పి.వీరస్వామి, ఎస్.వెంకటేశ్వర్లు కార్పొరేటర్ సోదా కిరణ్, సీపీఎం, ఎంసీపీఐ నాయకులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వివిధ సంఘాల నాయకులు బి.రమాదేవి, దాసురాం నాయక్, రాజయ్య, బండి మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భూములు ఆక్రమిస్తే శిక్షార్హులు



ఆలయ భూములను పరిశీలిస్తున్న ఈఓ

హన్మకొండ కల్చరల్: దేవాలయాలకు సంబంధించిన భూములను ఆక్రమిస్తే దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/87 ప్రకారం శిక్షార్హులవుతారని భద్రకాళి దేవాలయం కార్యనిర్వహణాధికారి కె.శేషు భారతి హెచ్చరించారు. పెద్దమ్మగడ్డలోని కేఎస్ఆర్ గార్డెన్స్ వెనుక భాగంలో సర్వే నంబర్ 479లోని మూడెకరాల భూమి భద్రకాళి దేవాలయానికి అనుబంధ దేవాలయమైన సీతారామచంద్రస్వామి దేవాలయానికి (చిన్నకొవెల) సంబంధించినదని పేర్కొన్నారు. కాగా, ఆ భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు జెండాలు పాతడంతో దేవాదాయశాఖ సిబ్బందితో కలిసి దేవస్థాన భూములను ఈఓ శేషు భారతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శేషుభారతి మాట్లాడుతూ దేవస్థానం భూముల్లో పాతిన జెండాలను వెంటనే తొలగించాలని, లేకుంటే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఓ అన్నారు.

గౌడ కులస్తులు రాజకీయాల్లో రాణించాలి



మాట్లాడుతున్న రమేష్‌బాబు గౌడ్

కాజీపేట అర్బన్: గౌడ కులస్తులు రాజకీయ రంగంలోనూ రాణించాలని గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రమేష్‌బాబు గౌడ్ సూచించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ గౌడ హాస్టల్ భవన్‌లో హనుమకొండ జిల్లా గోపా అధ్యక్షుడు చిర్ర రాజుగౌడ్ ఆధ్వర్యంలో గౌడ్‌ల రాజకీయ చైతన్య సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 నియోజకవర్గాల్లో గౌడ ఓటర్లు అత్యధికంగా ఉన్నారని వివరించారు. రాబోవు రోజుల్లో రాజకీయ ప్లీనరీని నిర్వహించుకుని, పార్టీలకతీతంగా ఎన్నికల్లో నిలబడాలని అన్నారు. అనంతరం, గోపా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి, మండల కమిటీలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి సాయన్నగౌడ్, పెద్ది వెంకటనారాయణ గౌడ్, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, జనార్ధన్‌గౌడ్, డాక్టర్ లక్ష్మీనారాయణ గౌడ్, లయన్స్ కన్నా పరశురాములు, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, రాజేష్‌గౌడ్, చిర్ర ఉపేందర్, సునీల్, కిరణ్, ఆదర్శ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

17న జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ఖిలా వరంగల్: ఈనెల 17వ తేదీన తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ గోపాలస్వామి గుడి తోటగ్రౌండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను విజయవంతం చేయాలని క్రీడా నిర్వాహకుడు, వరంగల్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపునూత శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని ఎమ్మెల్యే నరేందర్ క్యాంప్ కార్యాలయం వద్ద అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, పసుపునూత శ్రీనివాస్‌తో కలిసి బాడీ బిల్డింగ్ వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు విద్యార్థులు, యువత, క్రీడాభిమానులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తొటం రంజిత్, కడారి సదానందం, పేరాల మల్లేశం, రాజ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న రమణారావు

హసన్‌పర్తి: ఇంటర్ దశ కీలకమని, ఈ సమయంలో విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో చదివి ముందుకు సాగాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి క్రాస్‌లోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఏకశిల జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను అధ్యాపకులు వెలికితీయాలని చెప్పారు. ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దేశాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నిర్దిష్టమైన ప్రణాళికతో క్రమశిక్షణతో కూడిన విద్యను ఏకశిలలో అందిస్తున్నట్లు వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్లు బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజారెడ్డి, ముచ్చు జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు తిరుపతిరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎస్.రాజిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి మురుగునీరు

- వరి దెబ్బతింటుందంటూ ఆందోళన చెందుతున్న రైతులు
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



పొలాల్లోకి చేరుతున్న మురుగు నీరు

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట - అంబాల ప్రధాన రహదారిలోని దత్తాత్రేయ వెంచర్ సమీపంలోని పంట పొలాలు కంపు కొడుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు నేరుగా పంట పొలాల్లోకి వెళ్తోందని దాంతో దుర్వాసన వస్తోందని, పంటలు పాడవుతున్నాయని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ మార్గంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా మురుగు కాల్వ ధ్వంసమైంది. దాంతో అయితే ఎగువ ప్రాంతాల నుంచి విడుదలవుతున్న మురుగును దారి మళ్లించారు. మురుగు నీరు కారణంగా పొలాల్లోకి వెళ్లలేని దుస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. ముప్పై ఎకరాల మేర పంట పొలాల్లోకి మురుగునీరు వచ్చి చేరుతోందని వాపోతున్నారు. మరోవైపు పందుల కారణంగా పంటలు ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు పొలాల్లోకి చేరడం వల్ల పంటలు పాడవుతున్నాయని ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అన్నదాతలు తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెట్లకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



జాతీయస్థాయికి ఎంపికైన అథ్లెట్లతో సీఐ, అథ్లెటిక్ సంఘం ప్రతినిధులు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 7వ తేదీ నుంచి బిహార్‌లోని పాట్నాలో జరగనున్న 18వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు వెళనున్న వరంగల్, హనుమకొండ జిల్లాల క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఆవరణలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుబేదారి పోలీస్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ హాజరై క్రీడాకారులకు కిట్లను అందజేసి మాట్లాడారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.పదివేల నగదు పారితోషకం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు వరదరాజేశ్వర్‌రావు, మూగల కుమార్, కృష్ణమూర్తి, పీఈటీలు రజనీకాంత్, అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట మహాశివరాత్రి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్, తదితరులు

కాజీపేట రూరల్: కాజీపేట మండలం మెట్టుగుట్ట రామలింగేశ్వరాలయంలో జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈమేరకు కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ మహా శివరాత్రికి కావాల్సిన ఏర్పాట్లకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట ఆలయ ఈఓ భారతి, స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన, చైర్మన్ దువ్వ నవీన్, డివిజన్ ప్రెసిడెంట్ వినోద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

ఎల్కతుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆ పార్టీ జిల్లాస్థాయి శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం రెండో రోజుకు చేరుకోగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయవాదం, మతం పేరుతో వైషమ్యాలను రెచ్చగొడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నించారు.

అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు

కమలాపూర్: మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ ధర్మశాస్తా సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయం కలశ గణపతి పూజ, పుణ్యాహవాచనం, గర్తన్యాసం, రత్నన్యాసం, దాతున్యాసం, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, దిక్భంధనం, దిష్టికుంభం, కళాన్యాసములు, నేత్రోన్మీలనం, బలిహరణ, నిత్య హోమాలు, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, అర్చన, అలంకరణ, గణపతి, కుమాస్వామి, ధ్వజస్తంభ శిఖర సహిత శ్రీ అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి దర్శనాలు, మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రాత్రి మహాదివ్య పడిపూజ నిర్వహించి భక్తులకు అల్పాహారం అందజేశారు.

మనుస్మృతి.. ప్రాచీన రాజ్యాంగం కాదు



మనుస్మృతి పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: అసమానత్వం, బానిసత్వాన్ని అమలుచేసే మనుస్మృతిని ప్రాచీన రాజ్యాగంగా ప్రచారం చేయడం సిగ్గుచేటని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ విమర్శించారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో మనస్మృతి పత్రాలను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుస్మృతి ప్రాచీన రాజ్యాంగం శిక్షాస్మృతి అనే పుస్తకాన్ని ప్రచురించిన తెలుగు విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సూచించారు. మనుస్మృతి పుస్తకావిష్కరణలో పాల్గొనడానికి వెళ్లనున్న ప్రభుత్వ సలహాదారుడు రమణాచారిని పదవీ నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు మాదాసి సరేష్, నాయకులు శ్రీనివాస్, అనిత, వనశ్రీ, రవీందర్, నరేష్, కృష్ణ పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో 'చిగురు' కార్యక్రమం



బహుమతులు అందజేస్తున్న అతిథులు

రామన్నపేట: ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాలలో ఆదివారం చిగురు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 ప్రభుత్వ పాఠశాలల నుంచి 950మంది విద్యార్థులు పాల్గొని చెస్, రంగోలి, డ్రాయింగ్, డ్యాన్స్, సింగింగ్, రన్నింగ్, సైన్స్ మోడల్ వంటి పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి వైద్యురాలి స్థాయికి ఎదిగినట్లు వివరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీఒక్కరు విజేతలతో సమానమని అన్నారు. యూత్ ఫర్ సేవ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎఫ్ఎస్ జాతీయ కమిటీ సభ్యుడు అర్జున్మయిలు, కోఆర్డినేటర్లు నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, పొలాస మల్లికార్జున్, కేయూ ప్రొఫెసర్ రమ, నిట్ ప్రొఫెసర్ శ్యామ్, సీనియర్ వలంటీర్స్ బూరం ప్రశాంత్, హర్షవర్ధన్, భరత్, ఛత్రపతి, శివాజీ, తరుణ్, అఖిల్, భగత్ పాల్గొన్నారు.

అందరికి ఉపాధి కల్పించడమే ఎస్‌బీపీ లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రావు

రామన్నపేట / వరంగల్ చౌరస్తా : స్వావలంబి భారత్ అభియాన్ (ఎస్‌బీపీ) ద్వారా స్టార్టర్‌లు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఉద్యోగాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఎస్‌బీపీ కృషి చేస్తోందని రాష్ట్ర కమిటీ కన్వీనర్, కొమురయ్య, మహానగర సంఘ్ సంచాలక్ డాక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు. వరంగల్ నగరంలో స్వావలంబి భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా ఉపాధి కల్పన కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వదేశీ జాగరణ్ మంచ్ దేశంలో స్వయం ఉపాధిని పెంచేందుకు శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగానే స్వదేశీ జాగరణ్ మంచ్ స్వావలంబి భారత్ అభియాన్ ప్రారంభించినట్లు వివరించారు. ప్రతిఒక్కరికి ఉపాధి కల్పిస్తూ 2030 నాటికి భారతదేశ పౌరులను, దేశాన్ని స్వావలంబన చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాంత సహ సంయోజకులు ఠాకూర్‌కేందర్ సింగ్, జాగరణ్ మంచ్ కన్వీనర్ కంది శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన కేంద్ర నిర్వాహకులు ఉల్లి వెంకటేశ్వర్లు, చిట్టిమల్ల శ్యాంప్రసాద్, తంగెళ్లపల్లి మోహనచారి, బద్రీనాథ్, రాజనరేంద్రచారి, శ్రీరామోజు శ్రీనివాస్, అనుపురం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ఉత్సవంలో పూజలు చేస్తున్న చీఫ్‌విప్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ గుడిబండల్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభారోహణ పర్వం ముగించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పులి విక్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్, విజయ్, దేవులపల్లి ప్రదీప్, సదువాల శ్రావణ్, పానుగంటి శ్రీధర్, బాబురావు, దయానంద్, రమేష్, రాజు, సారంగపాణి, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

నయీంనగర్: తెలంగాణ రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ పెట్రోల్‌పంప్ జంక్షన్‌లో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అడ్డాను చీఫ్‌విప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, చిర్ర రమేష్, సంజీవ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఎస్ఎన్ఎం క్లబ్ రోడ్డు



వెలగని విద్యుత్ లైట్లు

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్టీసీ - రైల్వే స్టేషన్ నుంచి ఎస్ఎన్ఎం క్లబ్ రోడ్డులో పదిహేను రోజులుగా కారుచీకట్లు కమ్ముకున్నాయి. నిత్యం రద్దీగల రోడ్డులో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ లేకపోవడంతో వాహన చోదకులు, బాటసారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులోనే రైల్వే గూడ్స్ షెడ్డు ఉండడంతో గూడ్స్ రైళ్ల నుంచి సరుకులు, ఎరువులు, ఇతర వస్తువుల ఎగుమతి, దిగుమతులు సాగుతుంటాయి. దీంతో లారీల రాకపోకలు, హమాలీ కార్మికులు రోజంతా రాకపోకలు సాగిస్తున్నారు. అదే రోడ్డులో వరంగల్ నుంచి నర్సంపేట వైపు పలు గ్రామాలకు వెళ్లే వాహనాలకు అడ్డా ఉంది. అధికారులు దృష్టి సారించి సెంట్రల్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అదుపు తప్పితే గుంతలోకే..



తవ్వి పూడ్చకుండా వదిలేసిన గుంత

సీతంపేటకు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. రహదారి పక్కనే భారీ గుంత తవ్వి వదిలిపెట్టారు. ఇప్పటి వరకు అక్కడ పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. ఇద్దరికి బలమైన గాయాలై ఆస్పత్రిలో చేరారు. కేబుల్ నెట్ ఏర్పాటు కోసం ఏడాది క్రితం భారీ గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేశారు. దాంతో అది ప్రమాదకరంగా మారింది. గుంతవద్ద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

- హసన్‌పర్తి